సాక్షి
తూర్పుగోదావరి

మంగళవారం । 11 । జూన్ । 2024



బంక్ కొడితే అడగండి..


పెట్రోల్ బంకుల వద్ద తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత యజమానులదే. ఈ సౌకర్యాలు లేకుంటే వారిని అడగాలి. - 8లో▸



ముగిసిన రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు

పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు సోమవారంతో అట్టహాసంగా ముగిశాయి. - 8లో▸

డెల్టాకు 8వేల క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: డెల్టా కాలువలకు సోమవారం 8వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,500, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 4,000 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ వద్ద 10.05 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

13న ఐటీఐ విద్యార్థులకు క్యాంపస్ సెలెక్షన్స్



ఎల్ఆర్ఆర్ కృష్ణన్, ప్రిన్సిపాల్

రాజమహేంద్రవరం రూరల్: జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఈ నెల 13వ తేదీన ఉదయం 9.00గంటలకు ధవళేశ్వరంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఐటీఐ)లో క్యాంపస్ సెలెక్షన్స్ నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్ఆర్ఆర్ కృష్ణన్ ఓ ప్రకటనలో తెలిపారు. డైరెక్టర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రైనింగ్ ఆదేశాల మేరకు జిల్లా ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, వికాస, ఏపీఎస్ఎస్డీసీ, టాటా స్ట్రైవ్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాల కోసం ఈ క్యాంపస్ సెలెక్షన్ నిర్వహిస్తున్నామన్నారు. హాజరయ్యే విద్యార్థులు తమ సర్టిఫికెట్స్, నకలు కాపీలు, రెజ్యూమ్‌తో పాటు హాజరు కావాలని ఆయన కోరారు.

'నీట్' ఫలితాలపై విచారణ జరపాలి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వైద్య, విద్యా కోర్సులు చదవాలనుకునే 24 లక్షల మంది విద్యార్థులకు గత నెల 5న నిర్వహించిన నీట్ పరీక్షను సక్రమంగా నిర్వహించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారని పీడీఎస్‌యూ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.కిరణ్ కుమార్ సోమవారం తెలిపారు. గతంలో ప్రశ్నాపత్రం లీకేజీ ఆరోపణలు వచ్చాయన్నారు. ఇప్పుడు మార్కుల్లో అవకతవకలు, విడుదల చేసిన ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఫస్ట్ ర్యాంక్ రావడం, ఎనిమిది మందికి ఒకే కేంద్రం కావడం వంటి పరిణామాలెన్నో చోటు చేసుకున్నాయన్నారు. ఎన్నికల ఫలితాల హడావుడిలో ఎవరూ పట్టించుకోరు అనే ధోరణిలో నీట్ పరీక్ష నిర్వహణ జరిగిన అక్రమాలను కప్పిపెట్టే ఉద్దేశంతో ఎన్‌టీఏ ఇలా చేసిందన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో ఉద్యోగ పరీక్షలు, ప్రవేశ పరీక్షలు వంటివన్నీ లీకేజీ, ప్యాకేజీలకే పరిమితమవుతున్నాయన్నారు. పరీక్షలు పగడ్బందీగా నిర్వహించని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, నీట్ పరీక్ష రాసిన విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ జరిపి మరోసారి నీట్ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు.

5 నుంచి శ్రీనర్మదేశ్వర నృత్యోత్సవం

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): నృత్యాంజలి కాకినాడ ఆధ్వర్యంలో జూలై 5,6,7 తేదీల్లో సూర్యకళామందిరంలో మూడు రోజులపాటు శ్రీనర్మదేశ్వర నృత్యోత్సవం పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. నృత్యోత్సవం పోస్టర్‌ను సోమవారం నృత్యాంజలి మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ అధినేత లోకేష్, కన్వీనర్ కృష్ణవేణి ఆవిష్కరించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 600 మంది నాట్య విద్యార్థులు, నాట్య గురువులు కార్యక్రమానికి హాజరు కానున్నారన్నారు. సోలో, డ్యూయల్, గ్రూప్ విభాగాల్లో నృత్య ప్రదర్శనలు జరుగుతాయన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రతిభావంతులైన నాట్య విద్యార్థులకు నర్తనమురి పురస్కారాలు, సర్టిఫికెట్లు అందజేయనున్నట్టు తెలిపారు. అలాగే నాట్య గురువులను సత్కరిస్తామని చెప్పారు.



అంతమాత్రాన వాడొద్దు

- నొప్పుల టాబ్లెట్‌లతో అనర్థాలు
- మోతాదు మించి వాడితే మొదటికే ముప్పు
- అనివార్యమైతే వైద్యుల సిఫారసుతోనే వాడాలి



అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్

అమలాపురం టౌన్: ఉరుకుల పరుగుల జీవితం.. ఆపై ఆహార అలవాట్ల మార్పులతో సగటు జీవి ఏదో ఒక సమస్యతో బాధపడుతున్నాడు.. శరీరంలో ఏ అవయవంలోనైనా కాస్త నొప్పి వస్తే చాలు వెంటనే అందుబాటులోని పెయిన్ కిల్లర్ టాబ్లెట్ వేసుకుని ఉపశమనం పొందుతున్నాడు. పదే పదే ఈ మందుల వాడడంతో శరీరానికి ప్రమాదం పొంచి ఉంది. నొప్పుల టాబ్లెట్‌లు, ఇంజెక్షన్లు అధిక మోతాదులో వాడితే అనేక ఆరోగ్య సమస్యలు వస్తాయి. వైద్యులు కూడా ఈ విషయాన్ని పదే పదే హెచ్చరిస్తున్నారు. నొప్పి ఏదైనా తొలుత వైద్యులను సంప్రదించి వారి సిఫారసులతో మందులు వాడితే సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు. ఇంటి వైద్యం, సొంత నిర్ణయాలతో తల, నడుం, కీళ్ల నొప్పులకు మనకు మనమే ఓ పెయిన్ కిల్లర్ మాత్ర వేసుకోవడం పరిపాటైంది. జిల్లాలో ఇటీవల కాలంలో పెయిన్ కిల్లర్స్ అతిగా వాడేసి ఆనక కొందరు అనారోగ్యం బారినపడి చేతులు కాలేక ఆకులు పట్టుకున్నట్లు వేలకు వేలు మెడికల్ బిల్లులు శక్తికి మించి చెల్లిస్తున్నారు. ఆసుపత్రుల్లో ఇన్ పేషెంట్లుగా అవస్థలు పడుతున్నారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రుల్లో పెయిన్ కిల్లర్స్ అధికంగా వాడడం వల్ల ఎదురైన అనర్థాలతోనే పేషెంట్లు కనిపిస్తున్నారు.

మూత్రపిండాలు, గుండెపై ప్రభావం

నొప్పి మాత్రలు వైద్యుల సిఫారసులు లేకుండా వాడడం వల్ల అవి నేరుగా మూత్రపిండాలను దెబ్బ తీస్తున్నాయి. కొందరికి గుండెపై ప్రభావం చూపుతున్నాయి. తొలుత మూత్రపిండాలపై అవి దండయాత్ర చేసి చివరకు డయాలసిస్ స్థాయికి తీసుకెళ్తున్నాయి. ఒక్కసారి డయాలసిస్ స్థాయికి రోగి వెళితే ఆ రోగిని రక్త మార్పిడి కోసం డయాలసిస్ సెంటర్‌కు తీసుకు వెళ్లాల్సిందే. అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో డయాలసిస్ యూనిట్‌ను ఇటీవల కాలంలో విస్తరించారంటే ఈ తరహా రోగులు ఎక్కువ కావడమే కారణం.

ఎంత చెబుతున్నా వినరేం..

వైద్యులు చికిత్స చేస్తున్నప్పుడు పెయిన్ కిల్లర్స్ లేదా ఇంజెక్షన్లు ఎక్కువ వాడకూడదని చెబుతూనే ఉంటారు. వాటివల్ల ఎదురయ్యే దుష్పరిణామాలను వివరిస్తుంటారు. ముఖ్యంగా పెయిన్ కిల్లర్స్‌తో కిడ్నీలపై చూపే ప్రమాదకర ప్రభావాన్ని పదే పదే హెచ్చరిస్తున్నారు. దీనికోసం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. అయినప్పటికీ అవగాహన లోపంతో కొందరు ఏదైనా నొప్పి పదే పదే వస్తుంటే సొంత వైద్యమో లేదా మెడికల్ షాపునకో వెళ్లి పెయిన్ కిల్లర్ టాబ్లెట్లు అడిగి వాడుతూ తాత్కాలిక ఉపశమనం పొందుతున్నారు. ఈ అలవాటే భవిష్యత్‌ను భయంకరంగా మార్చేస్తోంది. పెయిన్ కిల్లర్స్, ఇంజెక్షన్లు అధికంగా వాడడంతో కిడ్నీలపైనే కాదు కొందరికి గుండె సంబంధిత వ్యాధులకు దారి తీసేలా చేస్తున్నాయి. దీర్ఘకాలిక రోగులుగా మార్చేసి డయాలసిస్ లేదా గుండె పోటు బారిన పడేలా మార్చుతున్నాయి.

ఇలా చేస్తే మంచిది

కలుషిత నీరు తాగడంతో కూడా కిడ్నీలు దెబ్బతింటున్నాయి. ఈ క్రమంలో వడబోసిన, పరిశుభ్రమైన తాగునీటిని మాత్రమే తాగాలి. సొంత వైద్యంతో ఎడాపెడా పెయిన్ కిల్లర్స్ మందుల జోలికి వెళ్లకూడదు. అంతకు నొప్పి తీవ్రమైతే వైద్యున్ని సంప్రదించి సిఫార్సుల అనుగుణంగానే వాటిని తగిన మోతాదులో వాడాలి. రోజుకు కనీసం ఐదు లీటర్ల పరిశుభ్రమైన తాగునీటిని తీసుకుంటే మూత్రపిండాల వ్యాధులను చాలా వరకూ దూరం చేయవచ్చు.

ఉమ్మడి జిల్లాలో పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రస్తుతం 240 మంది డయాలసిస్ రోగులు ఉన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సమాచారం మేరకు అమలాపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలోని డయాలసిస్ సెంటర్‌లో 110 మంది రోగులు ఉన్నారు. అలాగే ఇక్కడి కిమ్స్ ఆసుపత్రి డయాలసిస్ సెంటర్‌లో 130 మంది వరకూ రోగులు ఉన్నట్లు సమాచారం. ప్రభుత్వ ఆసుపత్రిలో 17 డయాలసిస్ యంత్రాలతో ఆ సెంటర్‌ను ఇటీవల కాలంలో విస్తరించారు. **డయాలసిస్ రోగులు వారి రోగ తీవ్రతను బట్టి మూడు రోజులు, వారం రోజుల పరిమితితో డయాలసిస్ చేయించుకోవాలి. రక్త మార్పిడి అదే రక్త శుద్ధి చేయించుకుంటే డయాలసిస్ రోగుల పరిస్థితి నిలకడగా ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం నెల నెలా ఈ రోగుల వైద్య** ఖర్చులకు రూ.10 వేలు సమకూర్చుతోంది.

- తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్‌లో 80 మంది రోగులు చికిత్స పొందుతున్నారు. వీరు మూడు లేదా వారం రోజుల్లో ఒకటి లేదా రెండు సార్లు రక్త శుద్ధి చేయించుకుంటున్నారు. 80 మంది రోగులే కాకుండా జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, ఆసుపత్రిలోని డయాలసిస్ యూనిట్‌తో పాటు కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ ఆసుపత్రుల్లో కూడా కొందరు రోగులు వైద్యం పొందుతున్నారు.
- కాకినాడలోని సర్వజనాసుపత్రిలో డయాలసిస్ యూనిట్ ద్వారా 56 మంది రోగులకు సేవలు అందిస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు కాకినాడ నగరంలోని కొన్ని ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల్లో కిడ్నీ రోగులు రోజూ చికిత్స పొందుతున్నారు.

అత్యంత అప్రమత్తత అవసరం



నొప్పి ఏదైనా పెయిన్ కిల్లర్స్ టాబ్లెట్స్, ఇంజెక్షన్లు వాడేటప్పుడు మాత్రం అత్యంత అప్రమత్తంగా ఉండాలి. వైద్యులను సంప్రదించి వారి సిఫార్సుతో మాత్రమే పరిమితులకు లోబడి ఆ టాబ్లెట్లు వేసుకోవాలి. అతిగా వాడితే అవి మనిషి మూత్రపిండాలు, గుండెపై ప్రభావం చూపుతాయి. ప్రతి మనిషి తన శరీరానికి సరిపడా నీళ్లు తాగుతుంటే కిడ్నీల సమస్యల నుంచి చాలా వరకూ దూరంగా ఉండవచ్చు.

– డాక్టర్ కె.కార్తీక్, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త

గెలుపు శాశ్వతం కాదు

- వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై దాడులు, దౌర్జన్యాలు అమానుషం
- కార్యకర్తలు అధైర్య పడొద్దు...పిలిస్తే క్షణాల్లో వస్తాం...అండగా ఉంటాం
- బాధిత కుటుంబాలను పరామర్శించిన వైఎస్సార్ సీపీ నాయకులు

అనపర్తి: ఎన్నికల్లో గెలుపు శాశ్వతం కాదని, ఎన్నికైన నాయకులు గెలుపును ప్రజలు మనపై ఉంచిన బాధ్యతగా గుర్తెరగాలని మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ హితవు పలికారు. మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు, పార్టీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు తోట రామకృష్ణ సోమవారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించి ఎన్నికల ఫలితాల అనంతరం జరుగుతున్న దాడుల్లో గాయపడిన బాధితులు, బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాల అనంతరం టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు ఆకతాయి, ఆటవిక సంస్కృతికి తెర తీశారని విమర్శించారు. హింసాత్మక చర్యలు చేపడుతున్న వారిపై, రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దౌర్జన్యాలపై, దాడులపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని తెలిపారు. జక్కంపూడి రాజా మాట్లాడుతూ అధికారం శాశ్వతమని అనుకోవడం అమాయకత్వమే అవుతుందని అన్నారు. ఎన్నికల విజయం సాధించిన అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలే కానీ ప్రతిపక్ష పార్టీ నాయకులు, కార్యకర్తలపై దాడి చేయడం తగదన్నారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను చూస్తూ ఊరుకోండని టీడీపీ అధినేత చంద్రబాబు అధికారులు, సిబ్బందికి ఆదేశం ఇచ్చినట్లుందని ఆరోపించారు. కొన్నిరోజులుగా అనపర్తి నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులే దీనికి ఉదాహరణ అని అన్నారు. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో 1.30 కోట్ల మంది వైఎస్సార్ సీపీకి మద్దతు పలికారని, పార్టీకి 40 శాతం ఓట్లు వచ్చాయన్న విషయాన్ని కూటమి నేతలు గుర్తెరగాలన్నారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ ఓపిక, సహనంతో ఉన్నామే తప్ప ఈ రకమైన చర్యలకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. కేంద్రంలో ఎన్‌డీఏ ప్రభుత్వంలో కీలకమైన పాత్ర పోషించే స్థాయిలో ఉన్న టీడీపీ నేతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్రాభివృద్ధికి, ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై దృష్టిసారించాలని హితవు పలికారు. మా సహనాన్ని నిస్సహాయతగా చూడవద్దని, కార్యకర్తలు దాడులు ఆపకపోతే తిరగబడతామని హెచ్చరించారు. చంద్రబాబు గేమ్‌ప్లాన్‌లో భాగంగా టీడీపీ టికెట్లు రాక చివరి నిమిషంలో బీజేపీలో చేరి టికెట్లు దక్కించుకున్న నాయకుల ప్రవర్తనను బీజేపీ అధినాయకత్వం గమనించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అండగా ఉంటామని, పిలిస్తే క్షణాల్లో వచ్చి ఆదుకుంటామని భరోసానిచ్చారు. పార్టీ రాజమహేంద్రవరం పార్లమెంటరీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, తలారి వెంకట్రావు మాట్లాడుతూ సంస్కారం అదుపు తప్పితే మేము అదే మార్గంలో పయనించాల్సి వస్తుందని అన్నారు. జిల్లా బృందం నియోజకవర్గంలో పలు గ్రామాల్లో పర్యటించిందని, న్యాయపరంగా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో అధిష్టానంతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అన్నారు. ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, పార్టీ నాయకులు కొవ్వూరి సత్యనారాయణరెడ్డి, సత్తి రామకృష్ణారెడ్డి, నల్లమిల్లి మురళీ మోహన బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి వేణు, పక్కన జక్కంపూడి, సూర్యనారాయణరెడ్డి తదితరులు

సత్యదేవుని ఆలయం కిటకిట

- స్వామిని దర్శించిన 30 వేల మంది
- దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం
- ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చిన స్వామి, అమ్మవారు



సత్యదేవుని ఆలయం వద్ద స్వామివారి దర్శనానికి క్యూ లో నిల్చున్న భక్తులు

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని ఆలయానికి భక్తుల రద్దీ కొనసాగుతోంది. విద్యాసంస్థలకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో వారం రోజులుగా రోజూ వేలాది మంది భక్తులు స్వామివారి ఆలయానికి విచ్చేస్తున్న విషయం తెలిసిందే. సోమవారం కూడా సుమారు 30 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షిణ చేశారు. స్వామివారి వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరిందని అధికారులు తెలిపారు. సుమారు నాలుగు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో భోజన సౌకర్యం కలుగ చేశారు.

ముత్తంగి కవచాలంకరణలో దర్శనమిచ్చిన సత్యదేవుడు, అమ్మవారు

సోమవారం సందర్భంగా సత్యదేవుడు, అనంత లక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, ఈశ్వరుడిని ముత్యాల కవచాలు (ముత్తంగి)తో అలంకరించి పూజించారు. ముత్తంగి కవచాలంకరణలో స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించారు.

అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ



విజేత సాయి వెంకటేష్‌కు ధ్రువీకరణ పత్రం, నగదు బహుమతి అందిస్తున్న చెస్ టోర్నమెంట్ నిర్వాహకులు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం విక్టరీ అకాడమీకి చెందిన ముగ్గురు విద్యార్థులు ప్రతిభ చాటారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం కాస్మోపాలిటన్ క్లబ్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి 9వ తేదీ వరకూ నిర్వహించిన అంతర్జాతీయ చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో స్థానిక విక్టరీ అకాడమీకి చెందిన ద్రాక్షారపు సాత్విక్, కేశనకుర్తి రాజేష్, తాడి సాయి వెంకటేష్‌లు విజేతలుగా నిలిచారు. ఓపెన్ విభాగంలో ద్రాక్షారపు సాత్విక్ 13వ స్థానం సాధించి రూ.7 వేల నగదు బహుమతి కైవసం చేసుకున్నారు. కేశనకుర్తి రాజేష్, తాడి సాయి వెంకటేష్‌లు చెరో రూ.10 వేల నగదు బహుమతులు సాధించారని అమలాపురం విక్టరీ అకాడమీ అధ్యక్షుడు తాడి వెంకటసురేష్ తెలిపారు. ఈ చెస్ టోర్నమెంట్‌కు విదేశాలతోపాటు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 300 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతలను విక్టరీ అకాడమీ అధ్యక్షుడు వెంకట సురేష్ అభినందించారు.

దిగుబడి తగ్గినా పెరిగిన రాబడి

- కోకో పంటతో రైతుకు అదనపు ఆదాయం
- కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా సాగు
- ఎకరాకు రూ.2 లక్షల రాబడి
- క్వింటాల్ గింజలు రూ.50 వేలు

దేవరపల్లి: కోకో గింజలకు మార్కెట్లో డిమాండ్ పెరగడంతో రైతులకు గిట్టుబాటు ధర లభిస్తోంది. గత ఏడాది ధరతో పోల్చుకుంటే ప్రస్తుతం రెట్టింపు పలుకుతోంది. దిగుబడి తగ్గినప్పటికీ ధర బాగుండడంతో మంచి లాభాలు వస్తున్నాయి. ఈ పంటను కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో అంతర పంటగా సాగు చేస్తుండడంతో రైతులు అదనపు ఆదాయం ఆర్జిస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 20 ఏళ్లుగా కోకో పంట సాగవుతోంది. మెట్ట ప్రాంతంలో ఎక్కువ విస్తీర్ణంలో జరుగుతోంది. ఎకరాకు సుమారు రూ.2 లక్షల అదనపు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. దేవరపల్లి మండలం కురుకూరు, పల్లంట్ల, దేవరపల్లి గ్రామాల్లో ఎక్కువగా కోకో పంట సాగు చేస్తున్నారు. కురుకూరు, పల్లంట్ల గ్రామాల్లో సుమారు 550 ఎకరాల్లో సాగు చేసి లాభాలను పొందుతున్నారు.

ఎకరాకు సాధారణ దిగుబడి ఏడు క్వింటాళ్లు

కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో కోకోను అంతర పంటగా సాగు చేసి ఎకరాకు సాధారణ దిగుబడి 6 నుంచి 7 క్వింటాళ్లు సాధిస్తున్నారు. మొక్క తోటలు ఎకరాకు 4 నుంచి 5 క్వింటాళ్లు, ముదర తోటల్లో ఎకరాకు 6 నుంచి 7 క్వింటాళ్లు దిగుబడులు వస్తున్నట్టు రైతులు తెలిపారు. ఈ ఏడాది రబీలో **ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వచ్చినట్టు వివరించారు. దిగుబడి తగ్గినా మార్కెట్లో మంచి ధర ఉండడంతో ఆదాయం వస్తోందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.**

మార్కెట్‌లో మంచి డిమాండ్

క్వింటాల్ కోకో గింజల ధర రూ.50 వేలు పలుకుతోంది. సాధారణంగా ఏటా ఫిబ్రవరి నుంచి మే వరకు కోకో గింజలకు మార్కెట్లో డిమాండ్ ఉంటుంది. గత రెండేళ్ల గింజలకు గిట్టుబాటు ధర రాక రైతులు తక్కువ ఆదాయం పొందారు. క్వింటాల్‌కు రూ.22 వేల ధర లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి మే నెల 25 వరకు మార్కెట్లో కోకో గింజలకు మంచి డిమాండ్ ఏర్పడింది. క్వింటాల్ రూ.1.10 లక్షల నుంచి 1.25 లక్షల వరకు ధర పలికింది. మే 25 తర్వాత ధర తగ్గింది. ప్రస్తుతం క్వింటాల్ రూ.50 వేలు పలుకుతున్నాయి. ఎకరాకు 3 నుంచి 4 క్వింటాళ్ల దిగుబడి వస్తోందని, ప్రధాన పంట కొబ్బరి, ఆయిల్ పామ్ పంటలతో పాటు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల అదనపు ఆదాయం వస్తోందని రైతులు తెలిపారు.



పక్వానికి వచ్చిన కోకో కాయలు



ఎండబెట్టిన కోకో గింజలు

మొక్క వేసిన నాలుగో ఏట నుంచి దిగుబడి

మొక్క వేసిన నాలుగో ఏట నుంచి దిగుబడి వస్తోంది. మొక్కతోట ఎకరాకు 4 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. గతంలో మొక్కలను ప్రభుత్వం ఉద్యాన శాఖ ద్వారా రాయితీపై సరఫరా చేసేది. కొంతకాలంగా రైతులే నేరుగా కొనుగోలు చేసి తోటలు వేస్తున్నారు. కొబ్బరిలో ఎకరాకు 160, ఆయిల్‌పామ్‌లో 120 మొక్కలు వేస్తారు. మొక్క ఖరీదు రూ.12.50 ఉంది. బొమ్మూరులోని నర్సరీ నుంచి మొక్కలు కొనుగోలు చేస్తున్నారు. మొక్క వేసిన నాటి నుంచి 25 నుంచి 30 సంవత్సరాలపాటు దిగుబడి వస్తోందని రైతులు తెలిపారు.

జిల్లాలో మండలాల వారీగా కోకో పంట సాగు వివరాలు

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	మొక్క తోటలు
అనపర్తి	9.09	---
ఉండ్రాజవరం	538.01	9.62
కడియం	19.66	---
కోరుకొండ	57.48	---
కొవ్వూరు	309.99	5.48
గోపాలపురం	646.60	9.60
చాగల్లు	5,311.96	141.91
తాళ్లపూడి	189.79	---
దేవరపల్లి	2,389.58	18.32
నల్లజర్ల	1,845.08	34.98
నిడదవోలు	1,620.88	17.57
పెరవలి	203.47	00.85
రాజమహేంద్రవరం (రూరల్)	54.52	---
రాజానగరం	93.17	---
రంగంపేట	10.70	---
మొత్తం	13,299.98	238.33


చాక్లెట్స్, కేక్‌ల తయారీ

కోకో గింజలను చాక్లెట్స్, బేకరీల్లో కేక్‌ల తయారీకి వినియోగిస్తున్నారు. క్యాడ్‌బరీ, మోర్డ్ సంస్థలు రైతుల నుంచి కోకో గింజలు కొనుగోలు చేస్తాయి. సంస్థల ప్రతినిధులు రైతుల వద్దకు వచ్చి పంటను కొనుగోలు చేసి తీసుకు వెళతారు.

13,538 ఎకరాల్లో సాగు

తూర్పు గోదావరి జిల్లాలోని 18 మండలాల్లో కోకో సాగు చేస్తున్నారు. జిల్లాలో 13,538 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు.


అంతర పంటగా వేశా



కొబ్బరిలో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నా. 12 ఎకరాల్లో కోకో పంట ఉంది. ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. క్వింటాళ్ల ప్రస్తుతం రూ.50 వేలు ఉంది. గత ఏడాది ఎకరాకు 5 క్వింటాళ్ల దిగుబడి రాగా క్వింటాళ్ల ధర రూ.24 వేలు వచ్చింది. 12 ఎకరాలకు గత ఏడాది రూ.12 లక్షల ఆదాయం రాగా, ఈ ఏడాది రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల ఆదాయం వచ్చింది. దిగుబడి లేకపోయినా ధర బాగుంది.

– యలమాటి భాస్కరరావు, రైతు, కురుకూరు, దేవరపల్లి మండలం


గింజలకూ గిరాకీ



కొబ్బరి, ఆయిల్‌పామ్‌లో కోకో అంతర పంటగా సాగు చేస్తున్నా. ఎకరాకు 3 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. ప్రస్తుతం ధర ఆశాజనకంగా ఉంది. ఏప్రిల్, మే నెలలో ఊహించని ధర లభించింది. కిలో రూ. 1,200కు కొనుగోలు చేశారు. రైతులకు లాభదాయకమైన పంట. పామాయిల్‌లో కంటే కొబ్బరి తోటలు కోకోకు అనుకూలం. దిగుబడులు ఎక్కువగా ఉంటాయి. పామాయిల్ తోటలో అంతర పంటగా వేస్తే ఎకరాకు 3 క్వింటాళ్ల దిగుబడి వస్తుండగా, కొబ్బరిలో అయితే 5 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దిగుబడి తగ్గడంతో మార్కెట్లో గింజలకు గిరాకీ ఏర్పడింది.

– యాగంటి సాయిబాబు, రైతు, దేవరపల్లి

లాభదాయకంగా కోకో పంట



కోకో పంట లాభదాయకంగా ఉంది. కొబ్బరి, ఆయిల్‌పామ్ తోటల్లో రైతులు అంతర పంటగా సాగు చేసి మంచి ఆదాయం పొందుతున్నారు. ఎకరాకు సుమారు రూ. 2 లక్షల ఆదాయం వస్తోంది. కొవ్వూరు డివిజన్‌లోని చాగల్లు, దేవరపల్లి, నల్లజర్ల, నిడదవోలు మండలాల్లో ఎక్కువ విస్తీర్ణంలో కోకో సాగు చేస్తున్నారు. నాలుగు మండలాల్లో 11,165 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. 299 ఎకరాల్లో రబీలో మొక్క తోటలు వేశారు.

– సుజాత, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

పాముకాటుకు వ్యక్తి మృతి

ముమ్మిడివరం: పొలంలో అరటి తోటకు మందు పెట్టే పనిలో నిమగ్నమైన ఒక కౌలురైతును పాము కాటు వేయడంతో మృతి చెందాడు. ఎస్సై డి.సురేష్‌బాబు కథనం ప్రకారం.. ముమ్మిడివరం మండలం గాడిలంకలో కొబ్బరి తోటను కౌలుకు తీసుకుని ఆ తోటలో అంతర పంటగా సాగు చేస్తున్న అరటికి మందు పెడుతుండగా కౌలురైతు అరిగెల బాలాజీ (53)ను ఆదివారం సాయంత్రం పాముకాటు వేసింది. అతను అపస్మారక స్థితికి చేరుకోగా స్థానికులు ఆసుపత్రికి తీసుకు వెళ్తుండగా మార్గ మధ్యంలో మృతి చెందాడు. ఉప్పలగుప్తం మండలం సన్నవిల్లికి చెందిన బాలాజీకి భార్య దుర్గాభవానీ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

రోడ్డు ప్రమాదంలో..

జగ్గంపేట: వెంగాయ్యమ్మపురం గ్రామ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గోకవరం మండలం అరవపేట కాలనీకి చెందిన మండపాటి మణీరత్నం (33) ద్విచక్ర వాహనంపై జగ్గంపేటకు పనిపై వచ్చాడు. తిరిగి జగ్గంపేట నుంచి గోకవరం వెళుతుండగా వెంగాయ్యమ్మపురం గ్రామం వద్ద ముందు వెళుతున్న లారీని తప్పించే ప్రయత్నంలో ఎదురుగా వస్తున్న బస్ ఢీకొంది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు.

యువకుడిపై కేసు

కొవ్వూరు: బాలికను ప్రేమ పేరుతో మోసగించిన కేసులో ఆరికిరేవుల గ్రామానికి చెందిన కడియాలపల్లి ఆనంద్‌పై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఏడు నెలలుగా బాలికతో సన్నిహితంగా ఉంటూ మోసగించినట్లు ఫిర్యాదు అందిందని ఆయన వివరించారు.

బంక్ కొడితే అడగండి..

- పెట్రోల్ బంక్‌ల్లో వసతులు ఉచితం
- మరుగుదొడ్లు, తాగునీటి ఏర్పాటు తప్పనిసరి
- జిల్లాలో 190 పెట్రోల్ బంకులు

రాయవరం: ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు సెంచరీ దాటాయి. వీటి ధరలు పెరిగినప్పుడల్లా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే పన్నులపై ప్రజల్లో చర్చ సాగుతుంటోంది. ప్రతి లీటర్‌పై వ్యాట్ రూపంలో చెల్లిస్తున్న రుసుంతో వినియోగదారులకు బంకుల్లో యజమానులు సౌకర్యాలు కల్పించాల్సి ఉంది. ఈ సౌకర్యాల గురించి చాలా మందికి తెలియదు. ఒకరిద్దరు నిబంధనల పేరుతో ప్రశ్నిస్తే నిర్వాహకులు నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారనే విమర్శలున్నాయి. పెట్రోలు బంకుల వద్ద వినియోగదారులకు సదుపాయాలు అందించకపోతే ఫిర్యాదు చేయవచ్చు. ఆ సౌకర్యాలు ఏంటో తెలుసుకుందాం రండి..

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 190 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ పెట్రోల్ బంకుల ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న టూవీలర్, త్రీవీలర్, ఫోర్ వీలర్ వాహనదారులు ప్రతి రోజుకు అవసరమైన పెట్రోల్, డీజిల్‌ను వినియోగిస్తున్నారు. జిల్లాలో 42,199 ట్రాన్స్‌పోర్ట్, 4,37,716 నాన్ ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉన్నాయి.

స్వచ్ఛమైన తాగునీరు

బంకుల వద్ద స్వచ్ఛమైన తాగునీటి వసతి కల్పించాలి. దీనికోసం బంకు డీలర్ ఆర్వో యంత్రం, వాటర్ కనెక్షన్ స్వయంగా పొందాలి. ఏ బంక్‌లోనైనా తాగునీటి వసతి లేకపోతే చమురు మార్కెటింగ్ సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు.

మూత్రశాలలు, మరుగుదొడ్లు

స్వచ్ఛభారత్‌లో భాగంగా అన్ని బంకుల్లో వాహనదారులు, ప్రజల సౌకర్యార్థం శుభ్రతతో కూడిన మూత్రశాలలు, మరుగుదొడ్లు ఉండాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. వీటిని పలుచోట్ల ఏర్పాటు చేసినా వినియోగించేందుకు నిర్వాహకులు అనుమతించడం లేదనే విమర్శలున్నాయి. మరికొన్ని చోట్ల అసలు కనిపించని పరిస్థితి. బంకుల్లో ఇలాంటి సౌకర్యాలు లేకపోతే పెట్రోలియం సంస్థలకు ఫిర్యాదు చేయొచ్చు. లీటర్ పెట్రోల్, లేదా డీజిల్ కొనుగోలు చేస్తే అందులో మనం బంకులకు 4 నుంచి 8 పైసల వరకూ మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణకు చెల్లిస్తున్నాం.

గాలి ఉచితంగా నింపాలి

వాహనాల టైర్లలో గాలి నింపటానికి, గాలి శాతం తనిఖీ చేసుకోవడానికి అనువుగా బంకుల్లో కచ్చితంగా యంత్రాన్ని అందుబాటులో ఉంచాలి. గాలి నింపేందుకు కూడా ఓ వ్యక్తిని ఉంచాలి. బంకులో పెట్రోల్, డీజిల్ కొనుగోలు చేయకున్నా, వాహనదారులు కోరితే టైర్లలో గాలి తనిఖీ చేయాలి. ఇటీవల కాలంలో వాహనాల టైర్లలో సాధారణ గాలికి ప్రత్యామ్నాయంగా నైట్రోజన్ నింపుతున్నారు. ట్యూబ్‌లెస్ టైర్లు వస్తున్నాయి. వాటిలో నైట్రోజన్ నింపాలి.



బంకు వద్ద పెట్రోల్ వేయించుకుంటున్న వాహనదారుడు

ఆపద వేళ ఫోన్ సదుపాయం

అత్యవసర పరిస్థితుల్లో ఫోన్‌ను వినియోగించుకునే సదుపాయం బంకుల్లో ఉండాల్సిందే. మీరు వెళ్లే మార్గంలో ఏదైనా సమస్యలో చిక్కుకుంటే మీ వద్ద మొబైల్ ఫోన్ అందుబాటులో లేకపోతే భయపడాల్సిన పనిలేదు. ఏదైనా పెట్రోల్ బంక్‌ను సందర్శించటం ద్వారా మీరు ఏ నంబర్‌కు అయినా కాల్ చేసుకోవచ్చు.

ఫిర్యాదుల పెట్టె, ప్రథమ చికిత్స కిట్

ప్రతి బంకులో ఫిర్యాదు పెట్టె లేదా రిజిస్టర్‌ను అందుబాటులో ఉంచాలి. అందులో వినియోగదారుడు తమ ఫిర్యాదులను నమోదు చేయవచ్చు. ప్రథమ చికిత్స కిట్ ప్రతి బంకు వద్ద ఉండాలి. ప్రజలకు అవసరమైనప్పుడు వాటిని ఉపయోగించుకునే వీలుంటుంది. ఈ ప్రథమ చికిత్స పెట్టెలో ఆరోగ్యాన్ని రక్షించే మందులు ఉండాలి. దీంతో పాటు అన్ని మందులపై గడువు తేదీ కూడా రాసి ఉంచాలి. పాత మందులు ఉండకూడదు.

నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవచ్చు

పెట్రోల్, డీజిల్ నాణ్యత ప్రమాణాలను తెలుసుకునే హక్కు వినియోగదారులకు ఉంటుంది. పెట్రోల్, డీజిల్ నాణ్యత పరిమాణాన్ని తెలుసుకునేందుకు పరికరాలను సిద్ధంగా ఉంచాలి. వాటి ద్వారా నాణ్యతను పరీక్షించే హక్కు మనకు ఉంటుంది. అదే విధంగా పెట్రోల్, డీజిల్ తక్కువ వస్తుందనే అనుమానం వచ్చినా పరీక్షించుకోవచ్చు. క్వాలిటీ చెక్ టిష్యూ పేపరును కూడా ఉంచాలి. నోటీసు బోర్డులో సంబంధిత ఆయిల్ కంపెనీ సేల్స్ ఆఫీసర్ నంబరును అందుబాటులో ఉంచాలి.

సరైన అవగాహన లేక..



బంకుల్లో ఉన్న సౌకర్యాలను వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలి. పెట్రోలియం మంత్రిత్వ శాఖ అధికారులు అవగాహన సదస్సులు నిర్వహించాలి. అన్నింటికి కలిపి చమురుకు ధరలు చెల్లిస్తున్నారు. కానీ వాటిని మాత్రం వినియోగించుకునే పరిస్థితి చాలా తక్కువగా ఉంటుంది. దానికి కారణం ప్రజలకు సరైన అవగాహన లేకపోవడమే.

–సాపిరెడ్డి విశ్వనాథబాలాజీ (దొరబాబు), యర్రపోతవరం

ఫిర్యాదుల పెట్టె ఏర్పాటు చేయాలి



బంకులపై ఫిర్యాదు చేసేందుకు ప్రతి పెట్రోల్ బంకు వద్ద అందరికీ కనిపించేలా ఫిర్యాదుల పెట్టెను ఏర్పా టు చేయాలి. వాహనదారుల స్పందన రాసేందుకు వీలుగా రిజిస్టర్ కూడా అందుబాటులో ఉంచాలి. అలాగే బంకులపై ఫిర్యాదుకు సేల్స్ మేనేజరు, ఇతర అధికారుల నంబర్లు అందరికీ కనిపించే విధంగా ప్రదర్శించాలి.

–సత్తి రామారెడ్డి, చిరు వ్యాపారి, మండపేట

జిల్లాలో నిరంతరం తనిఖీలు



జిల్లాలో వివిధ కంపెనీలకు చెందిన 190 పెట్రోల్ బంకులు ఉన్నాయి. ఈ బంకుల్లో నిరంతరం తనిఖీలు చేపడుతున్నాం. ఎన్నికలకు ముందు వరకూ ప్రత్యేక యాప్ ద్వారా తనిఖీలు నిర్వహించాం. రెవెన్యూ, పౌరసరఫరాలు, పోలీసు అధికారులు కూడా తనిఖీలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేకించి ఫిర్యాదులు వస్తే సత్వరం ఫిర్యాదులపై స్పందిస్తున్నాం.

–ఎ.పాపారావు, జిల్లా పౌరసరఫరాల అధికారి, అమలాపురం

దోషులపై కఠిన చర్యలు తీసుకుంటాం

కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్: కె.గంగవరం మండలం ఎర్ర పోతవరంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అవమానపరిచిన ఘటనలో దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ సుసరాపు శ్రీధర్ స్పష్టం చేశారు. ఈ ఘటనపై పామర్రు పోలీస్ స్టేషన్‌లో పలు సెక్షన్ల కింద కేసు కూడా నమోదు చేశామని వివరించారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపి క్షేత్ర స్థాయిలో సమగ్ర దర్యాప్తు చేస్తున్నామన్నారు. రామచంద్రపురం డీఎస్పీ, సీఐ, ద్రాక్షారామ ఎస్సైలు నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక పోలీసు బృందాలతో లోతైన దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు. నిందితులు ఎవరైనప్పటికీ అదుపులోకి తీసుకుని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారని పేర్కొన్నారు. జిల్లాలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉందని ఎస్పీ స్పష్టం చేశారు. ఎన్నికలు, కౌంటింగ్ అనంతరం ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఈ యాక్ట్ అమలులో ఉంచామన్నారు. ఎవరైనా అల్లర్లకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రాత్రి సమయాల్లో అపరిచితులు సంచరిస్తుంటే, పోలీసులకు తెలిపాలని విజ్ఞప్తి చేశారు.

జోసా-2024 అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు స్పందన



జోసా అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌లో మాట్లాడుతున్న తిరుమల విద్యా సంస్థల చైర్మన్ తిరుమలరావు

రాజమహేంద్రవరం రూరల్: రాజమహేంద్రవరం రూరల్ కాతేరులోని తిరుమల విద్యాసంస్థల ప్రాంగణంలో సోమవారం జరిగిన జోసా-2024 అవేర్‌నెస్ ప్రోగ్రామ్‌కు సుమారు 4 వేల మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు వచ్చారని తిరుమల విద్యా సంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో తమ విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించారన్నారు. ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఐటీ, బిట్స్ లాంటి ప్రతిష్ఠాత్మక యూనివర్సిటీలలో సుమారు 600 మంది సీట్లు సాధిస్తారని తెలిపారు. ప్రతి ముగ్గురిలో ఒకరికి సీటు వస్తుందన్నారు. జోసా కౌన్సెలింగ్‌లో ఏవిధంగా ఆప్షన్స్ పెట్టాలి, ఎలా పెడితే ఏ బ్రాంచ్‌ల్లో సీట్లు వస్తాయనే అనేక ప్రశ్నలకు తిరుమలరావు అవగాహన కల్పించారు. పూర్వ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తమ అనుభవాలను పంచుకున్నారు. అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గోపాలకృష్ణ పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి టీటీ పోటీలు



పెద్దాపురంలో టీటీ పోటీల్లో విజేతలతో అతిథులు

పెద్దాపురం: పెద్దాపురం శ్రీప్రకాష్ సినర్జీ పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహించిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ ర్యాంకింగ్ పోటీలు సోమవారంతో అట్టహాసంగా ముగిశాయి. ఏపీ టీటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగింపు సభలో టీటీ సెక్రటరీ మోహన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయ్‌ప్రకాష్ మాట్లాడారు. ప్రస్తుతం టీటీ క్రీడపై అందరికీ ఆసక్తి పెరిగిందన్నారు. మన రాష్ట్రం నుంచి జాతీయ స్థాయి టీటీ పోటీల్లో ఎంతోమంది రాణిస్తున్నారన్నారు. అనంతరం టీటీ పోటీల్లో విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల జాయింట్ సెక్రటరీ సమీరా, పారిశ్రామికవేత్త పస పద్మరాఘవ రావు, చీఫ్ రిఫరీలు రమణకుమార్, వేణుగోపాల్, ఆయా జిల్లాల అంపైర్లు తదితరులు పాల్గొన్నారు.

విజేతలు వీరే...

అండర్-11 బాలికల విభాగంలో శీలం మనస్వి, బాలుర విభాగంలో మోహిత్ శ్రీ కపీస్ సంగిడి, అండర్-13 బాలికలలో ఎస్‌కే ఆరిఫా సుల్తానా, బాలుర విభాగంలో హార్దిక్‌రామ్ వారణాసి, అండర్-15లో మిద్ది శాంతి జ్యోతి, బాలుర విభాగంలో పామిరెడ్డి జాతిన్‌రెడ్డి, అండర్-17 బాలికలలో మౌపర్ణాదాస్, బాలుర విభాగంలో తెల్రప్రోలు సంవేద్, అండర్-19 బాలికల విభాగంలో హాసిని పాపసాని, బాలుర విభాగంలో వెంకట మణికుమార్ పొన్నూరు, మహిళా విభాగంలో కాజోల్‌సునర్ రాంజలి, పురుషుల విభాగంలో సూర్యతేజ తలిదేవర విజేతలుగా నిలిచారు.

చోరీ కేసులో ముగ్గురి అరెస్ట్

రావులపాలెం: చోరీ ఘటనలో ముగ్గురిని ఎస్సై ఎల్.రాజేష్, స్టేషన్ సిబ్బంది సోమవారం అరెస్ట్ చేసి వారి నుంచి సొత్తు రికవరీ చేశారని జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. ఆ వివరాల ప్రకారం.. రావులపాలెం గ్రామానికి చెందిన తుంగ కనకదుర్గ ఇటీవల అనారోగ్యంతో ఉన్న తన భర్తను బొల్లినేని ఆసుపత్రిలో జాయిన్ చేసింది. ఆ సమయంలో ఆమెకు అక్కడ సత్తి శివపార్వతి అనే ఆమెతో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయంతో ఈ నెల 4న శివ పార్వతి, ఆమె స్నేహితురాలు జిత్తుక పార్వతి, గణేష్ అనే వ్యక్తితో కలసి కనకదుర్గ ఇంటికి వచ్చారు. ఆ సమయంలో కనకదుర్గకు ఆ ముగ్గురు కూల్ డ్రింక్‌లో మత్తు మందు ఇచ్చి నిద్రలో ఉండగా, ఆమెకు సంబంధించిన 80 గ్రాముల బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్లు, ఏటీఎం కార్డులు, చీరలు, రూ. ఐదు వేల నగదు మొత్తంగా రూ. 2,10,000 విలువైన సొత్తును దొంగిలించారు. దీంతో కనకదుర్గ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా ముగ్గురినీ ఎస్సై రాజేష్ అరెస్ట్ చేసి వారి నుంచి బంగారం రికవరీ చేసి కోర్టులో హాజరుపర్చారు. కేసును ఛేదించిన అధికారులను జిల్లా ఎస్పీ అభినందించారు.

పురుగు మందు తాగిన యువకుడు

కాకినాడ క్రైం: ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. ప్రత్తిపాడులోని వెంకట్‌నగర్‌కు చెందిన తుంగపల్లి ఉదయభాస్కర్ (24) వ్యక్తిగత కారణాలతో సోమవారం ఉదయం పురుగు మందు తాగాడు. కుటుంబ సభ్యులు అతన్ని స్థానిక ఆసుపత్రికి తరలించగా, అక్కడి వైద్యుల సూచనలతో కాకినాడ జీజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఈ ఘటనపై ప్రత్తిపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇద్దరు డ్రైవర్లపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు



అమలాపురంలో ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు డ్రైవర్‌కు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్ష చేస్తున్న ఎస్ఐ కిశోర్‌బాబు

అమలాపురం టౌన్: మద్యం తాగి వాహనాలు నడుపుతున్న ఇద్దరు డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్లు పట్టణ ఎస్ఐ కిశోర్‌బాబు తెలిపారు. అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు సూచనలతో సోమవారం రాత్రి అమలాపురం నుంచి హైదరాబాద్ వెళుతున్న రెండు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లకు డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా, వారిద్దరూ మద్యం తాగినట్లు గుర్తించామన్నారు. ఇక నుంచి రోజూ అమలాపురం నుంచి బయలుదేరే ప్రైవేట్ హైటెక్ ట్రావెల్స్ బస్సుల డ్రైవర్లపై నిఘా ఉంటుందని ఎస్ఐ స్పష్టం చేశారు.

యువతి ఆత్మహత్యాయత్నం

కాకినాడ క్రైం: వ్యక్తిగత కారణాల నేపథ్యంలో పిఠాపురం పాదగయ ప్రాంతానికి చెందిన టేకి లహరి (19) అనే వివాహిత ఆదివారం రాత్రి నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న ఆమె తల్లి బాధితురాలిని స్థానిక ఆసుపత్రిలో చేర్పించింది. అక్కడి నుంచి సోమవారం ఉదయం కాకినాడ జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించింది. ఈ ఘటనపై పిఠాపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది.

జారిపడి వ్యక్తికి గాయాలు

కాకినాడ క్రైం: పెద్దాపురం మండలం కట్టమూరు గ్రామానికి చెందిన పుట్టా వీరబాబు (60)తాగిన మైకంలో జారిపడి ఆసుపత్రి పాలయ్యాడు. తిమ్మాపురంలో అతను జారిపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చగా, అపస్మారక స్థితికి చేరాడని గుర్తించిన వైద్యులు మెరుగైన వైద్యం నిమిత్తం కాకినాడ జీజీహెచ్‌కు సిఫారసు చేశారు. దీంతో అతన్ని జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స కొనసాగుతోంది.

రత్నగిరి ఘాట్‌రోడ్‌లో ప్రమాదం



ఘాట్ రోడ్‌లో కొండను ఢీకొన్న కారు

అన్నవరం: స్థానిక రత్నగిరి మొదటి ఘాట్‌రోడ్‌లో సోమవారం కారులో ప్రయాణిస్తున్న భక్తులకు పెను ప్రమాదం తప్పింది. కాకినాడ నుంచి సత్యదేవుని దర్శనానికి గాను అన్నవరం వస్తున్న భక్తుల చిన్న కారు మొదటి ఘాట్‌రోడ్ రెండో మలుపులో కొండను ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయ్యింది. అయితే కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయట పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

కాకినాడ క్రైం: కాకినాడ రూరల్ మండలం చీడిగ గ్రామ నేరేళ్లమ్మ గుడి సమీప వాసి వి.దుర్గాప్రసాద్ (28) తన ఇంటి వద్ద ప్రమాదవశాత్తు సోమవారం తెల్లవారుజామున విద్యుదాఘాతానికి గురయ్యాడు. కుటుంబ సభ్యులు వెంటనే కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు.

పొదల్లో బుస్.. బుస్

- రైతన్నలూ ఆదమరిస్తే ఆపదే
- వర్షాకాలంలో పొంచి ఉన్న పాముల బెడద
- ఏడాదిలో 227 మంది పాముకాటు బాధితులు

రాయవరం: వర్షాకాలం వచ్చిందంటే చాలు పాముల బెడద ఎక్కువవుతోంది. వాతావరణంలో వేడి తగ్గి భూమి చల్లబడిన సమయంలో విష పురుగులు సహజంగా బయటకు వస్తుంటాయి. ఇలా బయటకు వచ్చిన విష సర్పాలు, పురుగులు రాళ్ల గుట్టలు, దట్టమైన పొదల మాటున ఉంటాయి. పొదలు, అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాల్లో పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. అలాగే పొలాల్లోని గడ్డివాములు, గట్ల వెంబడి తిరుగుతుంటాయి. ఇళ్ల పరిసరాలు, పొలాల్లోనూ సంచరించే విష సర్పాలు, తేళ్లు, ఇతర విష కీటకాలతో ప్రమాదం పొంచి ఉంది. వీటి బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. నాగుపాము, కట్లపాము, పొడపాము, రక్తపింజర వంటి వాటివల్లే ప్రమాదం అధికంగా ఉంటుంది. సాధారణంగా 50 శాతం పైగా పాముల వల్ల ఎటువంటి ప్రమాదం ఉండదని వైద్యులు చెబుతున్నారు.

రైతన్నా.. జాగ్రత్త అవసరం

పొలం గట్ల వెంబడి వెళ్లేటప్పుడు కర్ర చప్పుడు చేస్తూ నడవడం మంచిది. రాత్రి పూట పొలాలకు నీరు కట్టడానికి వెళ్లేటప్పుడు టార్చిలైట్లు తీసుకు వెళ్లాలి. ధాన్యపు గాదెలు, గడ్డివాములు ఉండే చోట ఎలుకలు, తడిగా ఉంటే కప్పలు తిరుగుతాయి. వాటిని ఆహారంగా తీసుకునేందుకు పాములు చేరతాయి. అలాగే తేళ్లు, జెర్రెలు వంటి ప్రమాదకర ప్రాణులు సంచరించే అవకాశముంది. ఎక్కువగా పాములు పొదలు, గోడల వారగా చేరతాయి. ప్రజలు చీకట్లో బయటకు వెళ్తే తప్పనిసరిగా చెప్పులు వేసుకోవాలి.

విషసర్పాల కాటు లక్షణాలు

విషసర్పం కాటు వేసిన ప్రదేశంలో పాము కోరల గాయం స్పష్టంగా కనిపిస్తుంది. నొప్పి తీవ్రంగా ఉంటుంది. నొప్పి క్రమంగా పైకి వ్యాపిస్తూ తిమ్మిరిగా అనిపిస్తుంది. పాక్షిక పక్షవాతం కారణంగా నాలుక మందమైనట్లు, గొంతు కండరాలు బిగుసుకున్నట్లు గొంతులో ఏమీ దిగని పరిస్థితి తలెత్తవచ్చు. చొంగ కారవచ్చు. కళ్లు మగతగా, శరీరం మత్తుగా ఉండి స్పృహ కోల్పోవచ్చు. నాగుపాము అత్యంత ప్రమాదకరం. ఇది కాటువేస్తే 15 నిమిషాల్లో విషం ఎక్కుతుంది. ఈ పాము విషం ప్రధానంగా నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. ఎవరినైనా పాము కరిస్తే అది విష సర్పమో కాదో గుర్తించే ప్రయత్నం చేయాలి. దానివల్ల చికిత్స కచ్చితంగా చేసేందుకు వీలవుతుంది. పాము కాటుకు గురైన వ్యక్తిని ఆస్పత్రికి తరలించి వైద్యం అందించాలి. నాటు వైద్యం, మంత్రాల జోలికి వెళ్లరాదు. పాముకాటుకు గురైన వారు ఆందోళన చెందితే గుండెపోటు వచ్చే అవకాశముంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 2022 ఏప్రిల్ నుంచి 2023 జూన్ వరకూ 191 మందికి పాము కాటుకు గురయ్యారు. 2022 జూలైలో అధికంగా 25 మంది, నవంబరులో 24 మంది పాముకాటు బారిన పడ్డారు. 2022 ఏప్రిల్ నుంచి 2023 జూన్ వరకూ 154 మంది పురుషులు, 37 మంది మహిళలు పాముకాటుకు గురైనట్లు వైద్య ఆరోగ్య శాఖ గణాంకాలు తెలియజేస్తున్నాయి. 2023 జూన్ నుంచి ఇప్పటి వరకూ 227 మంది పాటుకాటుకు గురయ్యారు. ఈ బాధితులకు జిల్లా ఆసుపత్రితో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, అర్బన్ హెల్త్‌సెంటర్లు, ఏరియా ఆసుపత్రుల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందులు అందుబాటులో ఉంచారు. బాధితులకు ఉచితంగా మందులు వేస్తున్నారు.

వైద్యం ఆలస్యం కారాదు



పాముకాటు వేసిన వారికి ధైర్యం చెప్పి, వెంటనే వైద్యం అందించేందుకు ప్రయత్నించాలి. ముందుగా ప్రథమ చికిత్స చేయాలి. కట్ల, నాగు పాములు కాటువేస్తే నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి బాధితుడు కోమాలోకి వెళ్లే అవకాశముంది. పాముకాటు వేయగానే నిర్లక్ష్యం చేయకుండా సాధ్యమైనంత త్వరగా ప్రథమ చికిత్స చేయించి, ఆసుపత్రిలో చేర్చాలి.

–వి.అనిరుధ్, పీహెచ్‌సీ వైద్యాధికారి, రాయవరం



నాగుపాము



యాంటీ వీనమ్ ఇంజెక్షన్

ఆసుపత్రుల్లో ఉచితంగా మందులు



జిల్లాలోని అన్ని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లలో యాంటీ స్నేక్ వీనమ్ (పాము కాటు మందులు) అందుబాటులో ఉన్నాయి. మందుల కొరత ఏర్పడితే ఆసుపత్రి అభివృద్ధి కమిటీల ద్వారా మందులు కొనుగోలు చేసుకోవచ్చు. జిల్లాలో ఎక్కడా కొరత లేదు.

–దుర్గారావుదొర, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం